



## ఘనంగా కళా–కరకౌశల ప్రదర్శన

**జీ న్యూస్, నిజామాబాద్ :**

సిరికొండ మండల కేంద్రంలోని పీఎం శ్రీ తెలంగాణ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల & కళాశాల ఆవరణలో విద్యార్థుల సృజనాత్మకతకు వేదికగా కళా, కరకౌశల (హార్ట్ &క్రాఫ్ట్) ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసే లక్ష్యంతో పాఠశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనను వైభవంగా ఏర్పాటు చేశారు.ఈ ప్రదర్శనలో విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల కళాకృతులు తల్లిదండ్రులు, సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వ్యర్థ పదార్థాల నుంచి ఉపయోగకరమైన వస్తువులు (బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్), మట్టితో రూపొందించిన కళాకృతులు, పెయింటింగ్స్, ఎంబ్రాయిడరీ వర్క్స్, హ్యాండీక్రాఫ్ట్ నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.భారతీయ సంస్కృతి ప్రతిబింబించే చిత్రాలతో పాటు ఆధునిక సైన్స్, ఆర్ట్ మేళవింపుతో రూపొందించిన నమూనాలు అందరి ప్రశంసలు పొందాయి. విద్యార్థులు తాము రూపొందించిన వస్తువుల వెనుక ఉన్న ఆలోచన, తయారీ విధానాన్ని సందర్శకులకు వివరించిన తీరు వారి ఆత్మవిశ్వాసాన్ని స్పష్టంగా చూపించింది.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, నేటి విద్యా విధానంలో పుస్తక జ్ఞానంతో పాటు ఇలాంటి కళా ప్రదర్శనలు విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, సృజనాత్మకతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, విద్యార్థులను అన్ని రంగాల్లో సమగ్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రదర్శన విజయవంతానికి సహకరించిన ఉపాధ్యాయ బృందానికి, విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

# విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలి

- నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి

**జీ న్యూస్, నిజామాబాద్:**



ప్రభుత్వ గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల భద్రత, సంక్షేమానికి ఎనలేని ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు, హాస్టళ్ల ప్రాంతీయ సమన్వయకర్తలు (ఆర్‌సీఓలు), నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవల కామారెడ్డి జిల్లాలో చోటుచేసుకున్న ఘటనలను ప్రస్తావిస్తూ, ఎట్టి పరిస్థితుల్లోనూ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పిల్లల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా బాలికల గురుకులాలు, వసతి గృహాల నిర్వహణలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. బాలికల హాస్టళ్లలో అనవసర వ్యక్తులు ప్రవేశించకుండా కట్టడి చేయాలని, తల్లిదండ్రులు వచ్చినప్పుడే వారి వెంట ఇంటికి పంపాలని సూచించారు. సీసీ కెమెరాలు తప్పనిసరిగా పని చేసేలా చూడాలని తెలిపారు. వసతి గృహాల ప్రాంగణాలు, పరిసర ప్రాంతాల్లో గుంతలు, ప్రమాదకర పరిస్థితులు ఉంటే తక్షణమే పరిష్కరించాలని అన్నారు. పరిసరాల పరిశుభ్రత, శుభ్రమైన తాగునీటి సరఫరా, ఆహార పరిశుభ్రత, పౌష్టికాహారం అందించడంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. హాస్టళ్ల పరిసరాల్లో పిచ్చి మొక్కలు, గడ్డి పెరగకుండా చర్యలు తీసుకోవాలని, పాముకాటు వంటి ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. క్రమం తప్పకుండా ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. మెనూ ప్రకారం శుభ్రమైన ఆహారం అందించేందుకు వంటగది సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని అన్నారు. వంట పాత్రలు శుభ్రంగా కడిగేలా పర్యవేక్షించాలని, నిల్వ ఉంచిన నాన్‌వెజ్ ఆహారాన్ని అందించకూడదని ఆదేశించారు. విద్యార్థులతో ఆప్యాయంగా వ్యవహరిస్తూ, తమ సొంత బిడ్డలుగా భావించి వారి సంక్షేమానికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, ఆర్‌సీఓలు, హాస్టళ్ల నిర్వాహకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నామినేషన్ల స్వీకరణ కేంద్రాల పరిశీలన

**జీ న్యూస్, ఆర్మూర్ :**





మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు సీహెచ్. సత్యనారాయణ రెడ్డి, ఆర్మూర్ డివిజన్ పరిధిలోని నామినేషన్ల స్వీకరణ కేంద్రంను శుక్రవారం పరిశీలించారు. ఆర్మూర్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, భీంగల్ మండల పరిషత్ కార్యాలయాలను సందర్శించి, నామినేషన్ల స్వీకరణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. నిబంధనలకు అనుగుణంగా స్వీకరణ ప్రక్రియ జరుగుతోందా అని నిశిత పరిశీలన చేశారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలు, హెల్ప్ డెస్క్ లను పరిశీలించారు. నామినేషన్ల స్క్రూటినీ, ఉపసంహరణ, పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్ల సన్నద్ధతపై అధికారులతో చర్చించి, బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల మెటీరియల్ గురించి అడిగి తెలుసుకున్నారు. టీ పోల్ యాప్ లో ఎన్నికల రిపోర్టులు అప్లోడ్ చేస్తున్న వైనాన్ని పరిశీలించారు. అబ్జర్వర్ వెంట ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు ఉన్నారు.

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**
**జనవరి30(ప్రజా శంఖారావం):**

మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు సీహెచ్. సత్యనారాయణ రెడ్డి నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. నిజామాబాద్ నగర పాలక సంస్థ పరిధిలోని 13, 14' 15 డివిజన్ల నామినేషన్ల స్వీకరణ కేంద్రంతో పాటు అర్సపల్లి వాటర్ ట్యాంక్ జోన్ ఆఫీసు, బోధన్, ఆర్మూర్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, భీంగల్ మండల పరిషత్ కార్యాలయాలను సందర్శించి, నామినేషన్ల స్వీకరణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. నిబంధనలకు అనుగుణంగా స్వీకరణ ప్రక్రియ జరుగుతోందా అని నిశిత పరిశీలన చేశారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలు, హెల్ప్ డెస్క్ లను పరిశీలించారు. నామినేషన్ల స్క్రూటినీ, ఉపసంహరణ, పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్ల సన్నద్ధతపై అధికారులతో చర్చించి, బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల మెటీరియల్ గురించి అడిగి తెలుసుకున్నారు. టీ పోల్ యాప్ లో ఎన్నికల రిపోర్టులు అప్లోడ్ చేస్తున్న వైనాన్ని పరిశీలించారు. అబ్జర్వర్ వెంట బోధన్, ఆర్మూర్ సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు ఉన్నారు.

# ‘స్పర్శ’ లెప్రసీ అవగాహన ప్రచారం

- చేగుంటలో చైతన్య కార్యక్రమం

**జీ న్యూస్, చేగుంట :**




మెదక్ జిల్లా చేగుంట మండలంలో జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమం (ఎన్ఎల్ఈపీ) ఆధ్వర్యంలో ‘స్పర్శ’ లెప్రసీ అవగాహన ప్రచారం ప్రారంభమైంది. ఈ ప్రచారం జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు 14 రోజుల పాటు కొనసాగనుంది. జాతిపిత మహాత్మా గాంధీ కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల చూపిన మానవీయ దృక్పథం, సేవలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం జనవరి 30న కుష్టు వ్యాధి వ్యతిరేక దినంగా పాటిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా చేగుంట మండలంలోని పీహెచ్‌సీ, జెడ్‌పీహెచ్‌ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**కుష్టు వ్యాధి లక్షణాలు**

ఆరోగ్య శాఖ అధికారులు కుష్టు వ్యాధిని గుర్తించేందుకు ముఖ్యమైన లక్షణాలను వివరించారు. వాటిలో చర్మంపై లేత గోధుమరంగు లేదా ఎర్రటి మచ్చలు కనిపించడం, స్పర్శ కోల్పోవడం, మచ్చలపై చర్మం మందంగా మారడం, జిడ్డుగా మెరపించడం, చెవులు, ముఖంపై కురుపులు, నాడ్యూల్స్ ఏర్పడడం, కనుబొమ్మల వెంట్రుకలు రాలిపోవడం, కళ్లను పూర్తిగా మూయలేకపోవడం, ముక్కులో రక్తస్రావం, చేతులు–పాదాల్లో తిమ్మిరి, నొప్పిలేని గాయాలు, వస్తువులు పట్టుకోవడంలో ఇబ్బందులు, పాదరక్షలు జారిపోవడం, వేళ్లు వంకర తిరిగి అంగవైకల్యం రావడం వంటి లక్షణాలు ఉన్నాయని తెలిపారు.

**చికిత్స విధానం**

కుష్టు వ్యాధి మైక్రోబాక్టీరియం లెప్రి అనే బాక్టీరియా వల్ల వస్తుందని, దీనిని హ్యాన్సన్ డిసీజ్ అని కూడా అంటారని అధికారులు వివరించారు. ఐదు మచ్చల కన్నా తక్కువ ఉన్న పీబీ రకం కుష్టు వ్యాధి ఆరు నెలల్లో పూర్తిగా నయం అవుతుందని, ఐదు మచ్చల కన్నా ఎక్కువ ఉన్న ఎంబీ రకం పన్నెండు నెలల్లో పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎండీటీ మందులు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, సమయానికి చికిత్స తీసుకుంటే అంగవైకల్యాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు.

**ప్రజలకు విజ్ఞప్తి**

ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటా వెళ్లి పరీక్షలు నిర్వహిస్తున్నందున అనుమానిత లక్షణాలు ఉన్నవారు తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని అధికారులు కోరారు. ‘వివక్షతను అంతం చేయడం, గౌరవాన్ని కాపాడటం’ అనే నినాదంతో ఈ ప్రచారం కొనసాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ అనిల్ కుమార్ రెడ్డి, పీహెచ్‌సీ చేగుంట సిబ్బంది, డీపీఎంఓ సంతోష్ కుమార్, సిహెచ్ఓ అనీసుద్దీన్, పిహెచ్ఎన్ నాగమల్లేశ్వరి, హెచ్ఎస్ నాగమణి, హెచ్ఏ సిబ్బంది, జెడ్‌పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## బిచ్కుంద నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్

**జీ న్యూస్, జుక్కల్:**

కామారెడ్డి బిచ్కుందలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పాత బస్టాండ్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి శుక్రవారం పరిశీలించారు. నామినేషన్ చివరి రోజు కావడంతో నామినేషన్ స్వీకరణ సమయంలో అభ్యర్థులకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా సజావుగా జరిగేలా చూడాలని ఆమె సూచించారు. 12 వార్డులకు 4 నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేశారు. మూడో రోజు శుక్రవారం ఎక్కువ సంఖ్యలో నామినేషన్లు దాఖలు అయ్యాయి. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, స్వతంత్ర, జనసేన, జాగృతి పార్టీల నుంచి నామినేషన్లు వేశారు. కాంగ్రెస్ నుంచి అభ్యర్థులు అధిక సంఖ్యలో వేయగా వారిలో బీ ఫాం ఎవరికీ అనేది ఉత్కంఠ నెలకొంది.మున్సిపాలిటీలోని 12 వార్డులకు చివరి రోజు 101 నామినేషన్లు వచ్చినట్లు మొదటి రోజు 3, రెండో రోజు 34 మొత్తం 138 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు పేర్కొన్నారు.సబ్ కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ షేక్ హయ్యూమ్,ఎమ్మార్వో వేణుగోపాల్ ఉన్నారు.

## మృతి చెందిన బాలిక ఆచూకీ లభ్యం

**జీ న్యూస్, ఎడపల్లి :**

గురువారం మధ్యాహ్నం మూడున్నర గంటల ప్రాంతంలో ఏ ఆర్ పి క్యాంప్ గ్రామ శివారులోని నిజాంసాగర్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ 46/8 నీటిలో గుర్తుతెలియని,ఆరు సంవత్సరాల అమ్మాయి శవము లభించిన అట్టి కేసులో శుక్రవారం రోజున ఉదయం 10 గంటల ప్రాంతంలో మృతురాలి తల్లి సోషల్ మీడియాలో వైరల్ అయిన ఫోటోలను చూసి ప్రభుత్వ ఆసుపత్రి నిజామాబాద్ మార్చురీ గదికి వచ్చి,మహారాష్ట్ర ( రాష్ట్రం) నాందేడ్ జిల్లా ముఖేడ్ తాలూకా కేరూర్ గ్రామము నివాసస్తు రాలిని,అని చెప్పి తన పేరు అంకిత కొండ మంగ్లే చెప్పి తమ కూతురే పేరు ప్రాచి పాండురంగ కొండ మంగ్లే అని గుర్తించినది.నిన్న ఉదయము 11:30 గంటలకు తన భర్త పాండురంగ బాబురావు కొండ మంగలే ద్విచక్ర వాహనంపై వెళ్ళినారని, తిరిగి ఇంటికి తిరిగి రాలేదని తెలిపినది. ఆమె యొక్క వాంగ్మూలము నమోదు చేసుకొని, దర్యాప్తు కొనసాగిస్తున్నామని ఎడపల్లి ఎస్ఐ ముత్యాలమ్మ రమ తెలిపారు.

# బీజేపీ గెలుపులో కీలక పాత్ర పోషించాలి

**జీ న్యూస్, నిజామాబాద్ :**



మన ఇందూర్ మన మేయర్ అనే నినాదంతో ముందుకు వెళుతూ భారతీయ జనతా పార్టీకి గెలుపులో కీలకపాత్ర పోషిస్తారని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ అన్నారు శుక్రవారం నగరంలోని 51 డివిజన్ మాజీ కార్పొరేటర్ బాలకిషన్ ఇందూరు అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ గుప్తా జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ఆధ్వర్యంలో బీజేపీ లో చేరాల.. ఈ సందర్భంగా దేశ ప్రధాని సంక్షేమ పథకాలు ఆకర్షితులైన నేను భారతీయ జనతా పార్టీ లో చేరడం జరిగిందని బాలకిషన్ తెలిపారు.. జరగబోయే ఇందురు మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక సీట్లు భారతీయ జనతా పార్టీ గెలుచుకోవడమే కాకుండా మన ఇందూరు మన మేయర్ అనే నినాదం తో ముందుకు వెళుతూ భారతీయ జనతా పార్టీ గెలుపులో కీలకపాత్ర పోషిస్తానని తెలిపారు. ఎంపీ అరవింద్ ధర్మపురి ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ గుప్తా జిల్లా అధ్యక్షుడు దినేష్ అడుగుజాడల్లో పనిచేస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్లడానికి అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, పిల్లి శ్రీకాంత్, పవన్, హరీష్ రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు..

